అతడికి ఎన్నో రోజుల నుండి తిండి లేదు... ఎన్నో గంటల నుండి తాగటానికి నీరు లేదు. మండుతున్న ఇండియన్ సూర్యుడు అతడి తెల్లటి చర్మాన్ని నిర్దాక్షిణ్యంగా కాల్చివేస్తున్నాడు. అతడి పెదవులు ఎండి పగిలిపోయి వున్నాయి. పగుళ్ళ నుండి రక్తం స్రవించి ఎండిపోయి వుంది. ఒంటి నిండా పుండ్లు... తోలు చాలా చోట్ల వూడిపోయి భయంకరంగా వుంది. ఏ మాత్రం రక్షణలేని అరికాళ్ళ పరిస్థితి మరింత అధ్వాన్నంగా వుంది. కాళ్ళ నిండా పుండ్లు... వాటి నుండి దుర్గంధంతో రసి స్రవిస్తోంది. కొన్ని పుండ్లు ఇన్‌ఫెక్ట్ అయినట్టుగా వున్నాయి. కొన్నిచోట్ల ముళ్ళు గుచ్చుకున్న చోటే వూడిపోయి చీముపట్టి వున్నాయి.

అతడు నడుస్తున్న బాధల వలయం
కదులుతున్న నొప్పుల నిలయం
ఎప్పుడో అనిపించింది

ఈ బాధలకన్నా చావే మేలని... కాని ఎక్కడో చిగురించిన ఆశాంకురం మిణుకు మిణుకుమంటూ అతడిని నడిచేలా చేస్తోంది.

ఆకలి... దాహం... అతడి ఆత్మ స్థైర్యాన్ని హరించి వేస్తున్నాయి. శరీరపు బాధలు నరకాన్ని ప్రత్యక్షంగా చూపిస్తున్నాయి. కాని అతడిలోని ఫైటింగ్ స్పిరిట్ పట్టు విడననీయడం లేదు. అతడు సాగిపోతున్నాడు. ఎటు పోతున్నాడో కూడా అతడికి నిజానికి తెలియదు. ఒక నరకపు రోజు నుండి మరో రోజుకి... మృత్యు దేవతల్లా సిపాయిలు వెంటాడుతుండగా... ఆంగ్లేయులని చంపుతుండగా... వారి కోపానికి పిల్లలు, స్త్రీలు ఆహుతి అవుతుండగా... ఉత్తర హిందూస్థానంలో ఓ ప్రాంతంలో...

ఇన్నేళ్ళ సాహచర్యం... విధేయత... అభిమానం... ప్రేమ... వాత్సల్యం... మానవ సంబంధాలు... అన్నీ ఓ క్షణికపు ఉన్మాదంలో గాలిలో కలిసిపోయాయి.

ఈ ఉన్మాదానికి కారణాలు ఆంగ్లేయులకి ఇంకా తెలియదు.

ఆ సంవత్సరం 1857

సిపాయి కలహం... ఇండియన్ మ్యూటినీ... ఆంగ్లేయ చరిత్రకారుల అంచనా ప్రకారం.

ఈ దేశ స్వాతంత్ర్యపు ప్రథమ పోరాటం - భవిష్యత్‌లోని ఇండియన్ చరిత్రకారుల విశ్లేషణ ప్రకారం.

ఆ సమయంలో... అతి భయంకరమైన హింస... రక్తపాతం... నిగూఢంగా వున్న క్రోధ భావాలు బాహాటంగా నాట్యం చేసిన సమయం... అవి విచక్షణ మృగ్యమైన చీకటి రోజులు.

మీరట్... కాన్పూర్... లక్నో... ఢిల్లీ... ఇంకా ఎన్నో చోట్ల దారుణమైన హత్యలు జరిగాయి. వాటికి ప్రతిఫలంగా బ్రిటిష్ వారి ప్రతీకారం కొద్ది దినాల తరువాత మరింత భయంకరంగాపరిణమించబోతోంది.

**It was a moment of FRENZY**
**It was a moment of madness!!**

చరిత్ర పుటలు నెత్తుటి వరదల్లో తడిసిపోయాయి. రెండు వేపులా కొత్త హీరోలు... విలన్లు ఉద్భవించారు.

జనరల్ నీల్... బ్రిగేడియర్ జనరల్ హెన్రీ హావెలాక్... లెఫ్టినెంట్ కల్నల్ జాన్ నికల్సన్... క్లైమెన్సీ కానింగ్... ఆంగ్లేయుల తరపునా...

నానా సాహెబ్... మంగళ్ పాండే... ఝాన్సీ లక్ష్మీబాయి... తాంతియా తోపె... బహదూర్ షా జఫర్...

ఎందరో ఈ దేశ చరిత్రలోని ఆ భయంకర అధ్యాయంలో భూమికలు ధరించారు.

ఆ క్షణాన ఈ దేశంలోని ఆంగ్లేయుల జీవితాలు ఇదమిద్ధం తెలియని త్రాసులో వూగులాడాయి. ఈ దేశాన్ని పరిపాలిస్తున్న ఈస్ట్ ఇండియా కంపెనీ గతి ఎవరికీ అంతుబట్టడం లేదు. చిందరవందరగా వుంది... కన్‌ఫ్యూజింగ్‌గా వుంది. కొద్ది దినాలపాటు ఆంగ్లేయులు భారత భూమి నుండి తాత్కాలికంగా అదృశ్యమైపోయారు.

పాలకులకీ... పాలితులకీ... ఆ నాటకం పాలు పంచుకుంటున్న పాత్రధారులకీ అందరికీ ఒకే విధంగా అనిపించింది.

ప్రస్తుతం జరుగుతున్నది ఏదో ఈ దేశపు చరిత్రని మార్చివేయబోతున్నదని... మంచికో చెడుకో తెలియని విధంగా చరిత్ర గతి మారుతున్నదని... ఈ అపూర్వ సంఘటన అనూహ్యమైన చారిత్రక శక్తులని బరిమీదికి వదిలి చరిత్ర పథాన్ని మార్చివేసే పరిస్థితులకు దారి తీస్తుందని ఎందుకో వారికి అనిపించింది.

అయితే జరగబోయేది ఏమిటి?

సమాధానం ఎవరికీ తెలియదు.

చరిత్ర... భవిష్యత్... మాత్రమే సమాధానమివ్వగల ప్రశ్న అది.

తిరుగులేని విధంగా ఒక దేశపు చారిత్రక శక్తులు మథనంలో ఇరుక్కుపోయి వున్నాయి ఆ క్షణంలో...

నీలి కళ్ళ ఆంగ్లేయుడు చుట్టూ చూశాడు. నిస్సత్తువతో, ఒంటి నుండి బయటకు వస్తున్న నొప్పుల అలల మీద అతడి శరీరం ముందుకు నెడుతున్నది.

దూరాన ఓ గ్రామం కనిపించింది. త్రాగడానికి కనీసం నీళ్ళయినా దొరుకుతాయేమోనన్న ఆశ తల ఎత్తింది. దాహంతో నాలుక పిడచగట్టుకు పోయి వున్నది. తడారిన నోరు... శరీరంలో నీరు లేక ప్రతి అణువు ఆక్రోశిస్తున్నది. ముందు దాహం తీర్చుకున్న తర్వాత ఏమైనా తినడానికి దొరికితే బావుండనుకున్నాడు. ఇన్ని రోజుల ఆకలికి శరీరం ఓ విధంగా అలవాటు పడి పోయింది. బహుశా శరీరం ఆ క్షణంలో తన్ని తనే భక్షించుకుంటున్నది కాబోలుననుకున్నాడు. తీవ్రమైన క్షుద్బాధ ఎక్కడో మనసులోని లోతుల్లోకి పోయింది.

అతడి ఎముకలు బయటకు పొడుచుకు వస్తున్నాయి. దవడలు లోనికి పోయాయి. కొన్ని రోజుల నిరంతర దాహం, ఆకలి మనిషిలో ఎంత తీవ్రమైన మార్పులు తేగలవో చూడడానికి అతడు ఓ ప్రతీక.

ఆంగ్లేయుడు నడుస్తున్నాడు.

ఇండియన్ సూర్యుడు మాడుస్తున్నాడు.

గ్రామాన్ని సమీపించేసరికి అతడిలో ఏవేవ ఆలోచనలు వచ్చాయి. ఈ గ్రామం కూడా సిపాయిల చేతులలో వుంటే? తన మరణం ఖాయం.

ఆలోచన రాగానే ఠకీమని ఆగిపోయాడు.

గ్రామ ప్రజల ప్రవృత్తిని నిర్ధారణ చేసుకోకుండా గ్రామంలో ప్రవేశించడం అంత క్షేమం కాదని అతడికి బాగా తెలుసు. ముందు కొద్దిగా నీరు సంపాదించి దాహాన్ని తగ్గించి, కాసేపు సేద తీర్చుకుని గ్రామాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి. అందుకోసం ఎక్కడేనా దాగి వుండాలి. కొత్త శక్తి పుంజుకున్నాక తన భవిష్యత్ కార్యక్రమాన్ని గురించి ఆలోచించాలి. నిద్ర లేక, తిండిలేక దాహంతో శిథిలమైన తన శరీరాన్ని కాళ్ళు మోయలేక పోతున్నాయి. మనసు దిటవు చేసుకొని అతడు కదులుతున్నాడు అతి ప్రయాసతో.

ఊరి బయట ఓ చెట్ల సముదాయం వుంది. దాని నీడ లోనికి ప్రవేశించాడు నిశ్శబ్దంగా. కూర్చుని చుట్టూ చూశాడు.

కొద్ది దూరంలో వుంది గ్రామం. బహుశా ఓ వంద గుడిసెలు వుండవచ్చు. మధ్యాహ్నం భోజనాలు అయ్యాక గ్రామస్తులు విశ్రాంతి తీసుకుంటున్నారు. పైగా ఎండ దంచేస్తోంది. చల్లబడ్డాక గ్రామస్తులలో చలనం వస్తుంది. గుడిసెల్లోంచి పొగ బయటకు వచ్చి రాత్రి భోజనానికి వంట పనులు మొదలయ్యాయని తెలియజేస్తుంది. పిల్లలు బయటకు వచ్చి ఆటలాడడం ప్రారంభిస్తారు. గొర్రెలు, మేకలు, పశువుల మందలు పొలాల నుండి తిరిగి వచ్చేస్తాయి. గ్రామంలో సందడి మొదలవుతోంది.

ఇంతకీ ఈ గ్రామంలో బావి ఎక్కడుంది? ఎక్కడో వుండి వుండాలి. లేకపోతే ఓ చిన్న చెరువైనా దగ్గర్లో వున్నదేమో?

అలికిడి లేకుండా గ్రామం చుట్టూ తిరిగాడు. గ్రామం బయట ఓ మూల బావి వున్నదని కనిపెట్టాడు. ఓ ఊర కుక్క అక్కడ వున్న మడుగులోని నీరు తాగి దాహం తీర్చుకుంటోంది. మెల్లగా నూతిని సమీపించాడు. చుట్టుపక్కల ఎవరూ లేరు. నూతి లోనికి తొంగి చూస్తే నీరు ఎక్కడో పాతాళంలో వున్నట్టుగా చాలా లోతులో కనిపించాయి. చేదుకోనడానికి అక్కడ ఏమీ లేదు.

చుట్టూ చూశాడు.

ఊరి బయట నిశ్శబ్దంగా వున్న ఓ గుడిసె. ఆ గుడిసె బయట ఓ బొక్కెన తాడూ వున్నాయి. మెల్లగా వాటిని తీసుకువచ్చి నీరు తోడి కడుపు నిండా తాగాడు.

అంత తీయటి నీటిని అతడు తన జన్మలో తాగలేదు. అమృతంలా, జీవ జలంలా తోచింది. చల్లటి నీళ్ళు అతడి ఒంటిని తడిపినప్పుడు స్వర్గంలో వున్న ట్టు

# లాయిడ్ నాచ్ కథ

## కె. సదాశివరావు


గా తోచింది. అతడిని పీడిస్తున్న నొప్పుల నుండి ఉపశమనం కలిగింది. శరీరానికి కొద్దిగ సత్తువ వచ్చింది. ఎండిన నెత్తుటి పుండ్లను కడిగినప్పుడు హాయిగా ఫీలయ్యాడు. శరీరాన్ని ఆవరించిన మురికి... దుమ్ము... చెమట కలిసిన మిశ్రమ మాలిన్యం నీటిలో కలిసి మురికి చారికల్లా అతడి శరీరం మీద నుండి కారి నేలమీదకు జారాయి. ఇన్ని గంటల దాహాన్ని భరించిన శరీరం ఆ క్షణాన ఉల్లాసంగా ఫీలయింది.

సూర్యుడు ప్రతాపాన్ని చూపిస్తున్నాడు.

గ్రామం నిద్రపోతోంది.

బొక్కెన, తాటిని యథా స్థానాల్లో వుంచి మెల్లగా చెట్ల గుంపులోనికి ప్రవేశించాడు. నీడ... చల్లటి గాలి... ఎండ నుండి రక్షణ... పచ్చటి మెత్తని గడ్డి... నేల మీద పడుకుని క్షణంలో గాఢ నిద్రలోకి జారు కున్నాడు.

నిద్రలో... బాహ్య ప్రపంచానికి పూర్తి విరుద్ధంగా





మరో ప్రపంచం మేలుకుంది... అతడి అంతర్లోకాలకి ద్వారాలు తెరుచుకున్నాయి. కలల ప్రపంచంలో విహరించాడు అతడు...

ఇంగ్లండ్‌లో... అతడు పుట్టి పెరిగిన గ్రామం... ఇంగ్లీష్ విలేజ్... ఈటన్‌లో స్కూలు చదువు...

ఆక్స్‌ఫర్డ్‌లో కాలేజీ... చదివిన రోజులు... అతడి స్నేహితులు... ఆట పాటల్లో పాలుపంచుకున్న స్నేహితులు... చదువు చెప్పిన టీచర్స్... ప్రొఫెసర్స్...

అతడి జీవితంలోని గర్ల్‌ఫ్రెండ్స్... పెండ్లాడిన అందమైన ఐరిష్ రోజ్ లాంటి పిల్ల...... లిండా!!! లిండా మై లవ్!! మై ఓన్లీ లవ్!!! ఆమె నవ్వుతోంది!! బంగారు రంగు జుత్తు రింగు రింగులుగా ముఖం మీద పడుతుండగా... లిండా నవ్వుతోంది... ఎర్రటి లేత పెదవుల మధ్య తెల్లటి దంతాలు మెరుస్తుండగా... బుగ్గల మీద ఆరోగ్యపు మిసమిస తొణికిసలాడుతుండగా... నీలాల కళ్ళలో ఆకాశపు దూరాలు... సముద్రపు లోతులు గోచరిస్తుండగా... అందాలకి కొత్త నిర్వచనాలు తెలుసుకోవాలనే కుతూహలం పుట్టిస్తూ... లిండా నవ్వుతోంది... అమాయకంగా... తనని పునీతం చేసే నిర్మలమైన ప్రేమతో... మొదటి రోజులు... **Days of Wooing**... **Early days of married life**... తర్వాత వచ్చిన పిల్లలు... ఏంజెల్స్




లాంటి పిల్లలు... లిటిల్ జీన్... లిటిల్ డాలీ... ఓహ బ్యూటిఫుల్ డే లుక్!! It was a perfect life... Fulfilling life....The only life he knew... ఇండియాలో ఉద్యోగపు మొదటి రోజులు... తనని పూజించే వేలాది ఆర్త ప్రజానీకం... దరిద్ర నారాయణులు... డొక్కలు ఎండిన నిరాశా జీవులు... భవిష్యత్తులో ఏదో జరగబోతున్నదని ఏ మాత్రం నమ్మకం లేని నిరంతర వర్తమానంలో దౌర్భాగ్యపు జీవన మార్గంలో ఇరుక్కున్న దిక్కుతెలియని పక్షుల్లాంటి మనుషులు... వీళ్ళకి సేవ చేయడానికి ఈ దేశానికి వచ్చాడు... ఎప్పుడో?? An Eternity Ago!! అనైన పీడకల ప్రారంభమైంది...

ఆంగ్లేయులను... వారి భార్య పిల్లలను నిర్దాక్షిణ్యంగా చంపి వేశారు సిపాయిలు... క్యాంప్ నుండి జిల్లా కేంద్రానికి తిరిగి వెళ్లేసరికి బంగళాలు తగల బడిపోతున్నాయి... కంటోన్మెంట్ నిండా రక్తపు మడుగులు... శవాలు... హృదయ విదారకపు సన్ని వేశాలు... Loyal Servants... all dead... మిగిలిన వారు పారిపోయారు. ఆంగ్లేయుల కుటుంబాలు సర్వనాశనమై పోయాయి... అదృష్ట వశాత్తు తన భార్యాపిల్లలు ఇంగ్లండ్‌లో వున్నారు. వేలాది మైళ్ళ దూరంలో లండన్‌లో వున్నారు. They are safe, Thank God!! will he ever see them? బంగళా చేరేసరికి ఇంటిని కనిపెట్టుకుని వుండే తన సేవకులు... వంటవాడు... ఖిద్‌మత్‌గార్ చనిపోయి వున్నారు... పంఖా లాగేవాళ్ళు... బిస్తీలు... కూలీలు... ఇతరులు అందరూ పారిపోయి వుండాలి.

కొన వూపిరితో వున్న రాన్‌చరణ్ చెప్పాడు. అతడి శరీరం నుండి నెత్తురు కారి నేలంతా తడిసిపోయి వుంది. బయట బంగళా కాలిపోతోంది. బిగబట్టిన ప్రాణాలతో... ఇగిరిపోతున్న సత్తువతో అతి ప్రయాసతో చెప్పాడు.

"సాహెబ్! అంతా అయిపోయింది. సిపాయిలు వచ్చి దొరల్ని, దొరసానుల్ని, పిల్లా పాపల్ని నూన కోత కోసి బంగళాల్ని తగులబెట్టి వెళ్ళిపోయారు. అడ్డుపడితే నన్ను పొడిచారు. మీరు కూడా పారిపోయి మిమ్మల్ని రక్షించుకోండి!"

గంటల నుండి రక్తం బొట్లు బొట్లుగా స్రవిస్తూ అతడి ప్రాణాలు పోతున్నాయి. ఇతడి అభిమానానికి తనేమి ఇవ్వగలడు? ఇతడి విధేయత ఎంత గాఢమైనది? తెల్లదొర గుండెలు కదిలి అతడి కళ్ళలో కన్నీటి పొరగా మారి అంతులేని విషాదం, తెరలు తెరలుగా ధారా పాతంగా కారిన అశ్రువులు అతడిని కలవరపెట్టాయి.

తనకి తెలిసిన ప్రపంచపు గోడలు కూలిపడుతుంటే అతడు స్తబ్దంగా వుండిపోయాడు. తిరిగి ఇవ్వలేని ఋణానుబంధాలు అతడిని చలింప చేశాయి. మారబోతున్న ప్రపంచం అతడికి మానసిక వేదన కలిగించింది.

రాన్‌చరణ్ కన్ను మూశాడు.

బంగళా మంటల్లో ఆహుతి కాబోతోంది. పట్టణమంతటా కొలిముల్లా కాలుతున్న గృహ సముదాయాలు... వాటిలో మరణించిన తెల్ల వారి శరీరాలు... సేవాధర్మ ప్రతీకలైన స్వామి పరాయణులు... అన్నీ కాలి భస్మీపటలమై పోతాయి కాబోలు...

పొగలు...

కమురు కంపు...

భరించరాని దుర్వాసన... ఇగురుతున్న రక్తపు వాసన... కాలుతున్న మాంసపు వాసన...

పారిపోవాలని అప్పుడు నిర్ణయించుకున్నాడు.

ఎక్కడికో పోయి తల దాచుకుందామన్న ఆలోచన... అంతకు ముందు పట్టరాని ఆవేశం... తుపాకీ తీసుకుని గుర్రం మీద వెళ్ళి సిపాయిల్ని వేటాడి దొరికినంత మందిని షూట్ చేసి చంపేద్దామనుకున్నాడు. వీలున్నంత మందిని చంపి ఆనైన ప్రాణాలు పోయినా ఫరవాలేదు అనుకున్నాడు. అప్పుడు గుర్తుకు వచ్చింది సిపాయిలు బంగళాలోని తుపాకుల్ని వదిలి వుండరని, అన్నింటిని దోచుకుపోయి వుంటారని. బంగళాలో తుపాకుల కోసం చూచాడు. గన్స్ రాక్‌లో లేవు. కాలుతున్న బంగళా పొగతో నిండిపోయింది. కళ్ళ నుండి నీళ్ళు కారాయి. ఇంకా కొన్ని నిముషాల్లో బంగళా పరశురామ ప్రీతి అయిపోతుంది.

ఇప్పుడేం చేయాలి?

దూరంగా గన్ షాట్స్ వినిపించాయి. గుర్రాల డెక్కల చప్పుడు, ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి.

నిర్ణయం తీసుకున్నాడు అప్పుడు.

తన గుర్రానికి క్షేమమని తోచిన దిశగా దగ్గర పడుతున్న శబ్దాలకి దూరంగా దారి తీశాడు. ఆలోచించ డానికి టైం లేదు.

గుర్రం పేరు స్నోవైట్!

మెత్తటి దూది పింజ లాంటి తెల్లటి గుర్రం!

వెన్నెల రాత్రి చంద్రకాంతి కంటె తెల్లటి గుర్రం!

బ్యూటిఫుల్ క్రీచర్!

తన మనసు తెలిసిన గుర్రం!

క్యాంప్ నుండి తిరిగి వచ్చాక గుర్రానికి గుగ్గిళ్ళు తినిపించలేదు, నీరు పెట్టలేదు. ఎన్నో మైళ్ళ క్యాంప్ నుండి తిరిగి వచ్చి అలసిపోయిన మృగం అది. విధేయత తప్ప మరే విషయాలూ ఎరుగని అద్భుతమైన అశ్వం అది. యజమాని ఆజ్ఞని శిరసావహించి చూపిన దిశగా పరిగెత్తింది.

ఆ పరిస్థితిలో... చీకటిలో వెళ్ళగలిగినంత దూరం వెళ్ళి ఆంగ్లేయుడు ఆ రాత్రి ఓ మైదానంలో నిద్రించాడు. రాత్రి మంచు కురిసి చలి వేస్తే గుర్రపు జీను కింద వున్న బ్లాంకెట్ తీసి కప్పుకుని తారల పందిరి కింద నిద్రపోయాడు. అయినా అది కలత నిదర.

ఉదయం లేచినప్పుడు గుర్రం తన దగ్గరే తిరుగుతోంది బేల చూపులు చూస్తూ. తను లేచిన విషయం గమనించి తన దగ్గరకు వచ్చి తన చల్లని ముట్టెతో చెవి దగ్గర చిలిపిగా, మృదువుగా తాకింది. ఆప్యాయతతో దాని మెడ నిమిరాడు. కాని కుంటుతున్న దాని కాలు చూసినప్పుడు అతడి గుండె పగిలిపోయింది. భరించరాని దుఃఖం అతడిని ముంచేసింది. కాలు పట్టుకుని ఎక్కడ దెబ్బ తగిలిందో చూద్దామని పైకెత్తబోయాడు. బాధతో గుర్రం అలసిపోయింది. దాని కాలు విరిగిందని అర్థమయింది. చీకటిలో ఏదో గోతిలో అస్తవ్యస్తంగా అడుగు పడి కాలు విరిగి వుంటుంది. ఈ గుర్రాన్ని ఎక్కే ప్రశ్నే లేదిక!

**What is worse, the horse must be destroyed! Put it to sleep!**

గుర్రం వేపు చూశాడు. చల్లని చీకట్లు నిండిన చిరు సరస్సుల్లాంటి కళ్ళు, విషాదాన్ని వ్యక్తం చేయలేక అసహాయంగా చూసే వెర్రి గుర్రపు చూపులు అతడి గుండెని నిలువుగా కోశాయి.

గత ఇరవై నాలుగు గంటలలో అతడు తన ప్రపంచం మారిపోవడాన్ని గమనించాడు. జరిగిన సంఘటనలన్నీ విషాదభరితమైనవే అయినప్పటికీ నిజమైన ట్రాజెడీ ఇప్పుడే అతడికి తోచి కుదిపివేసింది. దిక్కు తెలియని చోట.. ఒక్కడే... ఈ లోకంలో... అనిర్వచనీయమైన భీతి అతడిని చలిగాలిలా చుట్టుముట్టి వణికించింది.

ఆ ప్రదేశం ఓ విశాలమైన మైదానం. నెత్తుటి రంగులో ఉషస్సులను చిల్చుకుంటూ భూమండలంలో సూర్యుడు ఉదయిస్తున్నాడు. పొగమంచు కరిగిపోయింది. తుషార బిందువులు ఇగిరిపోతున్నాయి.

తాను పోవలసింది ఉత్తర దిశగా. ఏదో ఓ పట్టణానికి చేరి తనని రక్షించుకోవాలి. ఎండ ముదిరితే ప్రయాణం కష్టతరమౌతుంది. ఏదో కంటోన్మెంట్... ఆర్మీ బారక్స్... చేరుకోవాలి... చేరుకుంటే రక్షణ లభిస్తుంది.

కాని ఇన్నేళ్ళుగా సేవ చేసిన గుర్రం ఏమౌతుంది?

అది ఇక నడవలేదు. తుపాకి వదిలిన బుల్లెట్‌లా పరిగెత్తే ప్రశ్న లేనే లేదు.

దానిని నిద్ర పుచ్చడం తన బాధ్యత.

**It was the kindest deed!**

లేకపోతే అతిక్రూరమైన విధికి ఈ అశ్వాన్ని వదలాలి.

ఓ గాడ్! స్వీట్ జీసెస్!!

**Please forgive me, Lord!!**

గుర్రాన్ని వదిలి వెళ్ళక తప్పలేదు.

నడుస్తూ వెనక్కి తిరిగి చూశాడు నీళ్ళు నిండిన కళ్ళతో. కుంటుతూ పెద్ద కళ్ళతో తన వంకకి చూస్తూ నడవబోయింది గుర్రం. వర్ణనాతీతమైన బాధతో ఆగిపోయింది.

అతడి గుండె పగిలింది.

పూర్ హార్స్! పూర్ సర్వెంట్స్!

ఈ ఉన్మాదానికి కారణమేమిటి?

ఎప్పుడు ఆగిపోతుందీ పిడకల?

ఓ గాడ్! ఇది ఆగిపోయేలా చూడు లార్డ్. మనసారా ప్రార్థించాడు.

నడక మొదలుపెట్టాడు... అది ఎన్నో యుగాల నాడు...

ఇప్పుడు నిద్రపోతున్నాడు.

కొన్ని గంటల తర్వాత నిద్ర లేచాడు. అది చల్లని సాయం సమయం. గ్రామంలో నిప్పు ముట్టించి వంట కార్యక్రమం ప్రారంభం చేశారు గ్రామ మహిళలు. వారి మాటలు వినిపిస్తున్నాయి. పిల్లలు అరుస్తూ ఆడుకుంటున్నారు. పశువులు ఊరికి తిరిగివస్తున్నాయి. ధూళి తెరల మధ్య నుండి అస్తమిస్తున్న సూర్యుడు ఎర్రగా కనిపిస్తున్నాడు. తోపులో చీకటులు కమ్ముకుంటున్నాయి. ఇండియన్ గ్రామపు వాతావరణం అంతటా అలుముకుంటోంది. కాలుతున్న పిడకలు... ఆకులు.. దుమ్ముధూళి... పొగ తాలూకు కమురుకంపు. గుడిసెల్లోంచి మెల్లగా వీచి అతడి నాసికా పుటాలకి తాకింది. అది టిపికల్ ఇండియన్ వాసన. ప్రపంచంలో మరే దేశంలోను ఈ వాసన వుండదు. ఆ పైన మహిళా దినుసుల తాలూకు ఘాటు వాసనలు గట్టిగా వీస్తున్నాయి. గాలిలో మందంగా.. అతడి నాసిక తిండి వాసనల్ని ఇట్టే పసిగట్టింది. తడిపిన పిండి... కూరగాయల వాసనలు.. కాలుతున్న ఉల్లిపాయలు... మిరపకాయలు... నోటిలో లాలాజలం పూరింది ధారాపాతంగా... పొట్టలో శబ్దాలు అధికమయ్యాయి.

అప్పుడు అతడికి ఆశ పుట్టింది.

జ్యూసీ స్టేక్స్! చికెన్ బ్రెస్ట్! లెగ్ ఆఫ్ లాంబ్... ఆయిస్టర్స్... పోర్క్! హామ్! సాసేజెస్! బేకన్! ఎగ్స్! ఆమ్లెట్స్! ప్రాన్స్! ఫిష్! కేక్స్! పేస్ట్రీస్! వెజిటబుల్స్! ఫ్రూట్స్! ఆపిల్స్! పియర్స్! పీచెస్! చెర్రీస్! స్ట్రాబెర్రీస్! డ్రింక్స్! డ్రింక్స్! స్కాచ్! జిన్! రమ్! బ్రాందీ! పోర్ట్! షెర్రీ! వోడ్కా! షాంపేన్! కాక్‌టెయిల్స్! పంచెస్! ఫ్రూట్ జ్యూసెస్!

గాడ్! ఈ ప్రపంచంలో ఇన్ని రకాల మీల్స్, డ్రింక్స్ వున్నాయని అతడెన్నడూ ఆలోచించలేదు.

**Always took them for gran- ted.**

అద్భుతంగా వండిన డెలికసీస్ అతడి మనో వీధిలో ప్రయాణం చేశాయి. కడుపులోని జఠరాగ్ని ఉజ్వలమై దహిస్తోంది. రకరకాల జలా లు పూరి జీర్ణ కోశంలో ఎడతెగని ఏక్టివిటీ మొదలైంది. నాలుకమీదా, నోటిలోనూ వున్న రుచి మొగ్గలు తెరచుకుని ఆవురావురు మంటున్నాయి. అతడి శరీరం తిండికి ఆర్రులు చాచింది. జఠరాగ్ని జ్వాలల్లో అతడు దహించుకుపోయాడు.

ఆ గ్రామంలోకి వెళ్ళి తిండి యాచిస్తే! బహుశా దయ గల ఏ తల్లి అయినా తనకి ఓ రెండు రొట్టెలు, కొంచెం కూర పెడుతుందేమో!

ఈ గ్రామ ప్రజలు కూడా సిపాయిల ప్రభావంలో వుంటే ఇతర ఆంగ్లేయుల లాగానే తనని కూడా తప్పక చంపేస్తారు. ఈ ఉన్మాద స్థితి దాటే వరకూ తన గతి ఇంతేనేమో! ఇంకా ఎందరు ఇంగ్లీష్‌మన్ తన లాగే చెట్ల పాలై తిరుగుతున్నారో అనుకున్నాడు. తప్పకుండా వుండే వుంటారు.


ఆకులు కదిలిన శబ్దం అయింది. ఓ పదహారు, పదిహేడేళ్ళ కుర్రాడు తన వంక తదేకంగా చూస్తున్నాడు. అతడి కళ్ళు పెద్దవవుతున్నాయి భయంతో. నోరు తెరుచుకుంటోంది.

"అమ్మా! బాబా!"

అతడు ఇంకా గట్టిగా అరవక ముందే ఆంగ్లేయుడు త్వరగా అన్నాడు.

"భయపడకు. నేను నిన్నేం చేయను. నేను దోస్తిని" హిందీలో అన్నాడు.

కుర్రాడు రిలాక్స్ అయాడు. ఇంకా తరిచి తరిచి చూస్తున్నాడు కన్నార్పకుండా... మురికిగా వున్న ఎర్ర గడ్డం... పగిలిన పెదాలూ... ఎర్రటి జుట్టు క్రింద మాడిన ముఖంలో ముదురునీలపు కళ్ళు... చూసేసరికి కుర్రవాడికి కొంచెం సామ్యభూతి గోచరించింది. ఆంగ్లేయుడు అనునయంగా చిరునవ్వు నవ్వాడు. పగిలిన పెదాల మీద రక్తం స్రవించింది. నాలుక చివరతో దాన్ని తుడిచివేసుకున్నాడు. ఉప్పగా తగిలింది. ఆశతో కుర్రవాడి వంక చూశాడు ఆంగ్లేయుడు.




కుర్రవాడి రంగు కందగడ్డలా వుంది. నల్లటి జుట్టు బాగా పెరిగి ముఖం మీదికి పడుతోంది. నిజానికి అతడి వయసెంతో చెప్పడం చాలా కష్టమని ఆంగ్లేయుడికి తెలుసు. ఈ మనుషులు ఎంతో దుర్భరమైన దారిద్ర్యంతో, మురికితో, అంతులేని ఆకలితో పెరుగుతారు ఎడారిలోని బ్రహ్మజెముడు పొదల్లా... ఒక్కోసారి బాగా వయసు వచ్చేవరకూ అలాగే బ్రతికి చనిపోతారు. కాని ఎక్కువ శాతం మనుషులు బాల్య దశని దాటరు. ఆ మనుషుల సుదీర్ఘ జీవితాల్లో కడుపునిండా తిండి ఎరగరు. సరైన బట్ట కట్టి ఎరుగరు. వినోదం అన్నది తెలియదు వారికి. కరువులు, కాటకాలు.... వరదలు.. రోగాలు... వారిని లక్షలాది సంఖ్యలో హతమారుస్తాయి. అయితేనేం మళ్ళీ అదే సంఖ్యలో పుట్టుకొచ్చి అదే విధంగా బ్రతికి చనిపోతుంటారు. వేలాది ఏళ్ళుగా వాళ్ళ పూర్వీకులు ఎలా బ్రతికారో అలాగే బ్రతకటం వారికి అలవాటు. వారి ముఖంలో దైవ నిర్ణయంతో నిర్ద్వంద్వంగా ఏకీభవించినప్పుడు కలిగే నిర్లిప్త భావన స్పష్టంగా కనిపిస్తుంటుంది. వారికి విధి మీద బాగా గురి. వారి భాషలో, సంస్కృతిలో అవిభాజ్యంగా ముడిపడి వున్న ఓ మాట వుంది. కర్మ! అన్ని బాధల్నీ, అవమానతల్నీ, అన్యాయాల్నీ విశదీకరించడానికి ఈ మాటని విస్తృతంగా ఉపయోగిస్తారు. కర్మని జయించడం అసాధ్యమని వారి ఉద్దేశ్యం. ఈ సిద్ధాంతం తరతరాలుగా వారి తలల్లోకి ఎక్కించబడి వారి రక్తమాంసాలలో జీర్ణించుకుపోయింది. వారి ప్రస్తుత దారిద్ర్యానికి, దుర్భర జీవితాలకీ, రోగాలకీ కారణం కర్మ... పూర్వజన్మ సుకృత ఫలం... వారు ఆ అంశాన్ని మారు మాట లేకుండా ఒప్పుకుంటారు. వాళ్ళు ఆనందం అనుభవిస్తారో, లేదో చెప్పడం కష్టం... హాయిగా నవ్వరు వాళ్ళు... భగవంతుడి సృష్టిలో పుట్టి గిట్టే ఎన్నోజంతు

జాలాల్లా, క్రిమి కీటకాల్లా, పక్షుల్లా, చెట్లులా వారు పుట్టి గిడుతుంటారు.

ఆంగ్లేయుడు నిట్టూరుస్తూ కుర్రాడి వంక చూశాడు.

కుర్రాడు నవ్వాడు పువ్విన పల్లటి పలువరుస కనబడేలా.

''దోస్త్?''

సంతోషంతో ఆంగ్లేయుడు అన్నాడు.

''దోస్త్!''

కుర్రాడు హిందుస్తానీలో ఏవేవో ప్రశ్నలు గబగబా అడిగాడు. ఆంగ్లేయుడు సహనంతో చెప్పాడు- తను పడమర దిశ నుండీ వచ్చాననీ, లక్నో వెళ్ళే ప్రయత్నంలో వున్నాననీ, తనకి సాయం కావాలనీ, భోజనకి కావాలనీ. 'నీవేమైనా సాయం చేయగలవా దోస్త్?'

కాస్సేపు మౌనంగా వున్నాడు కుర్రాడు. సమస్యని అన్ని కోణాలనుండీ ఆలోచిస్తున్నవాడిలా కనిపించాడు. చివరకు అడిగాడు.

''నీవు దొంగవా?''


ఆంగ్లేయుడు హతాశుడైనాడు.

''లేదు, లేదు నేను దొంగను కాను!''

''మరి ఎందుకు దాక్కున్నావ్?''

''ఎందుకో నేను చెప్పలేను. నా మాట నమ్ము! నేనే నేరం చేయలేదు. నేను దొంగని కాను. జరిగినదంతా ఓ పెద్ద కథ అవుతుంది. నీవు పెద్ద వాడివయ్యాక నీకు తెలుస్తుంది!'

''నీ దగ్గర డబ్బులేమైనా వున్నయ్యా?''



''నా దగ్గర డబ్బు లేదు. ఆగు... ఇది వుంది''

అతడి వేలికి వున్న వెడ్డింగ్ వుంగరం... గోల్డ్ బాండ్... తీశాడు. అది తేలికగా వూడి వచ్చింది.

దానిని కుర్రాడికి ఇచ్చాడు. కుర్రాడు తీసుకుని అటూ ఇటూ తిప్పి చూశాడు.

''ఇది ఎంత వుంటుంది? రూపాయి వుంటుందా?''

''రూపాయికన్నా ఎక్కువే వుంటుంది. నీ దగ్గరే వుంచుకో. వూరిలో ఎవరికీ ఇవ్వకు. నాకు భోజనం తెచ్చి పెట్టు దోస్త్'' దీనంగా అడిగాడు ఆంగ్లేయుడు.

''నీ గురించి మా అమ్మకి చెప్పి తీసుకొస్తాను''

''వద్దు, వద్దు. ఆమెకి చెప్పొద్దు. ఆమె అర్థం చేసుకోలేకపోవచ్చు!''

''మరి భోజనం ఎవరికి తీసుకెళుతున్నావని అడిగితే?''

''అడుక్కునేవాడికి పెట్టడానికి అని చెప్పు!''

''బిచ్చగాళ్ళకి అమ్మే పెడుతుంది. చూడు! నీవు మా ఇంటికి వచ్చి భోజనం చేయకూడదూ?''

''నేను రాలేను. వేరే సమస్యలున్నాయి. స్నేహితుడికి ఆ మాత్రం సాయం చేయలేవా దోస్త్?''

కొద్ది క్షణాలు ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు కుర్రాడు.

''సరే! ఇక్కడే వుండు. భోజనం పట్టుకువస్తాను'' గ్రామం దిశగా పరుగెత్తుకెళ్లాడు.

ఆంగ్లేయుడు పచ్చిక మీదకి వాలి ఆకాశం వంకకి చూశాడు. చీకటి కమ్ముకుంటూంది. చెట్ల నీడలు చుట్టూ పరచుకుని అప్పటికే రాత్రి ఛాయలు లోపులో ప్రవేశించాయి. తారలు ఆకాశంలో బయటకు వచ్చి మెరుస్తున్నాయి. చల్లటి పిల్లగాలి వీచింది. అలసి సొలసిన అతడి శరీరానికి ఎంతో హాయిగా అనిపించింది.

ఈ భయంకరమైన శాపగ్రస్త దేశంలో నేనేం చేస్తున్నాను? ఈ మనుషుల మధ్య నాకేం పని? అందాల దేశమైన ఇంగ్లండ్‌ని వదిలి.. సమృదనంతో కళకళలాడే నా దేశాన్ని వదిలి ఇక్కడేం చేస్తున్నాను? ఎడతెగని వానలతో, శీతాకాలం మంచు కురిసే ఇంగ్లండ్... ఆంగ్లేయుల హ్యూమర్... జీవితేచ్ఛా, బతకడంలోని నేర్పు... హాయిగా వుండడానికి... నవ్వడానికి మార్గాలు యోచించే మనుషులు... వున్న తన మాతృదేశాన్ని



నదిలి ఈ నరకానికి ఎందుకు వచ్చినట్టు? అర్థంలేని బ్రతుకులు... మృత్యువు నీడ క్రింద బ్రతికే ఈ మనుషులు... పైగా ఈ మనుషుల సంక్షేమం కోసం ఏం చేసినా ప్రయోజనం వుండదు. శ్రమ మిగిలిపోతుంది. వ్యర్థమై నామ రూపాలు లేకుండా పోతుంది. ఈ మనుషులకి వాళ్ళని గురించి వారికే తెలియదు. ఎన్నో భాషలు... మతాలు... కులాలు... సెక్ట్స్, సబ్ సెక్ట్స్... ఎన్నో విధాల సమాజం ముక్కలై శకలాల రూపంలో పరిణమించింది. నిరంతర ఘర్షణతో... రక్తపాతాలలో మునిగి తేలే మనుషులు వీరు... కారణాలు తెలుసుకోవాలనే ఆవలోకనం లేని మనుషులు...చేసిన తప్పులే మళ్ళీ మళ్ళీ చేసుకుంటూ చరిత్ర పొడుగునా చీకటి గుహల్లో అజ్ఞానపు వల్మీకాల్లో తలదాచుకునే మూర్ఖ జనం... వాళ్ళ నమ్మకాలు... వాళ్ళ వేలాది దేవుళ్ళు... దేవతలు... గుళ్ళు, గోపురాలు... మసీదులు... అర్థం కాని వేదాంతం... రక్తం చిందించే రిచువల్స్... బలులూ... రక్తదాహపు దేవతలు... జీవితాలకి ఏ మాత్రం విలువ లేకపోవడం... ఏదీ నీ చేతిలో లేదు... అంతా మిథ్య... కర్మ... నిర్వేదపు వేదాంత సారంతో నిర్వీర్యమైన జీవిత లక్ష్యాలు... ఓడిపోయిన మనుషులు... దగాపడిన జాతి... చరిత్రపరంగా ఎన్నో దెబ్బలు తిన్న ఈ మనుషుల్లో క్రౌర్యం... అకారణంగా ఆదే మనుషులు రక్తం తాగే రాక్షసులుగా మారగలరు. వారి కళ్ళు కాళరాత్రి నీడలు నిండిన కూపాలు... అన్నింటినీ మింగే చీకటి బిలాల్లాంటి కనుపాపల్లో ప్రతిఫలించే మిస్టీరియస్ భావాలు... కొత్త వాళ్ళని నెర్వస్‌గా చేస్తాయి. ఈ మనుషుల అమాయకత్వం ఓ నటన...

వారి అసహాయపు చేతలు దొంగ వేషాలు... బహుశా వారు తమలో తాము నవ్వుకుంటున్నారేమోనని పిస్తుంది. ఆంగ్లేయుల తెలివి తక్కువకి జాలి పడుతున్నారేమోననిపిస్తుంది. శ్రమపడి వారి అభ్యున్నతి కోసం ప్రయత్నాలు చేస్తుంటే ... శ్రమపడే వారికి లభించే దేమిటి? ఇక్కడేమి చేసినా ఎవరికీ పట్టదు. లక్షలాది ... కోట్లాది సోమరిపోతులు పుట్టుకొచ్చి శ్రమనీ, సత్ఫలితాలనీ క్షణాల్లో నేలమట్టం చేస్తారు. తర్వాత?... వారి దరిద్రపు లోకంలోనికి వెళ్ళిపోతారు. ఈ సమస్యలు వారికి పట్టవు... తమ జీవితాలనెందుకు వ్యర్థం చేసుకోవాలి?

బాధతో, భయంతో అతడి గుండె బరువెక్కింది. గొంతుక దుఃఖంతో పూడుకు పోయింది.

ప్రస్తుతం జరుగుతున్న పీడకల గడిచేక సామాన్లు పాక్ చేసుకుని ఇంగ్లండ్ వెళ్ళిపోవాలి. క్షేమంగా వున్న తన భార్యా పిల్లలతో అక్కడే జీవించాలి. నరకం లాంటి ఈ దేశాన్ని ...ఈ మనుషుల్ని వారి కర్మకి వారిని వదిలేసి తమ దారిన వెళ్ళిపోవడం ఆంగ్లేయుల విధి అనుకున్నాడు అతడు ఆ క్షణంలో. ఇక్కడ ప్రాణాలకు విలువలేదు.

ఏమీ లేని ప్రజలకి విలువలేమి తెలుస్తాయి?

అలికిడి విని లేచి చూసున్నాడు. భోజనపు వాసనలు అతడి ముక్కు పుటాల్ని ఆక్రమించుకున్నాయి. లాలాజలం వూరింది.

కుర్రవాడు భోజనాన్ని మురికి గుడ్డలో కట్టి పట్టుకొచ్చాడు. కూర ఓ చిన్న మట్టి పిడతలో తెచ్చాడు.

## మేఘం

మా చిన్నప్పుడు
'కానిగేరి' బళ్ళో చదువుకుంటున్నప్పుడు
మా సార్ నిద్రపోతున్నప్పుడు
ఆకాశం కేసి చూస్తూ అరుగుమీద కూర్చునే వాళ్ళం
అప్పుడు ఆకాశం లోని ఓ మేఘం
సంజీవిని పర్వతాన్ని మోసుకెళ్తున్న ఆంజనేయునిలా
కన్పించేది నాకు
నా మిత్రునికి అదే మేఘం
శివధనుస్సు విరుస్తున్న శ్రీరామచంద్రునిలా కన్పించేది
ఇంకో మిత్రునికి అదే మేఘం
మేకల్ని తోలుకెళ్తున్న పశువుల కాపరిలా కన్పించేది
ఎవరు ఎలా కన్పిస్తుందంటే
మిగతా వాళ్ళకి ఆ మేఘం అలాగే కన్పించేది
ఇప్పుడు
అస్పష్టత వెనుక దాక్కున్న నేటి కవిత్వం
సహజ స్వరూపాన్ని కోల్పోయి లేయర్ కోటై
పద చిత్రాలతో గారడీ చేస్తున్నట్టు వాక్యానిస్తే—
సంక్లిష్ట జీవితాన్ని సంక్లిష్ట కవిత్వంగా
ప్రవహింపజేస్తున్నామని
అనుభూతుల సమాధుల్లోకి వెళ్ళిపోయి
బొంబాయి మిఠాయిలా సాగదీస్తున్నట్టు
మా 'జాకంటి'కి కనిపిస్తే
జనాన్ని ప్రభావితం చేసే
కవితా చరణాల పోరు మా 'సాక్షి'కి విన్పిస్తుంది
ఇప్పటి 'ఈ' కవిత్వాన్ని చూస్తుంటే
మా చిన్నప్పటి మేఘమే గుర్తొస్తుంది

—జింబో

నీళ్ళు మట్టి కుండలో తెచ్చాడు.

కృతజ్ఞతతో ఆంగ్లేయుడు అన్నాడు.

"షుక్రియా దోస్త్! నీవు మంచి స్నేహితుడివి. గాడ్ బ్లెస్ యు" కుర్రవాడు చిరునవ్వు నవ్వాడు.

ఆంగ్లేయుడు నీటిలో చేతులు కడుగుకున్నాడు. భోజనం మీద దాడి చేశాడు. పట్టరాని ఆకలి ... అతడిని మెల్లగా తిననీయలేదు.

చపాతీలు నమిలాడు. అవి గట్టిగా వున్నాయి. బాగా మసాలా వున్న కూర. నోరు మండి పోయింది.

అతడికి డెలికసీలు తినడం అలవాటు.

వంట వాళ్ళకి అతడి అభిరుచులు తెలుసు.

ఇంగ్లీషు వంటలకి ఓ కుక్...

మొగలాయి వంటకాలకి మరొకడు.

ఇద్దరు మసాల్చీలు... అతడి వద్ద పని చేసేవారు.

అతడికి వైన్స్ ... షాంపేన్ ... స్కాచ్ అన్నా ఇష్టం. అతడి ఇంటిలో పెద్ద సెల్లర్ వుంది. ఎన్నో క్రేట్స్ నిండా డజన్ల కొద్దీ బాటిల్స్ వున్నాయి.

పార్టీ లివ్వడం, క్లబ్‌లలో ఎలెగెంట్ మనుషులతో, పార్టీలలో పాల్గొనడం అతడికి అలవాటు.

వీకెండ్స్ సరదాగా గడిపి ఆనందంగా కాలం వెళ్ళబుచ్చడం కమ్యూనిటీ ధర్మంగా భావించేవారు. వాల్డ్‌గ్ ఫాక్స్ ట్రాట్, ఇతర డాన్సెస్ చేయడం, ఫన్నీగా వుండే కథలు చెప్పి అతిథులకి పొట్టచెక్కలయ్యేలా నవ్వించడం అతడికి సామాన్యం. పార్టీలకి లైఫ్ అతడు... ఇంగ్లీష్ కమ్యూనిటీలో అతడు చాలా పాప్యులర్...బ్రిలియంట్ స్కాలర్... లాటిన్, గ్రీక్, ఫ్రెంచ్, ఉర్దూ, పర్షియన్, పుష్టూ, హిందీ, మరాఠీ అతడు చక్కగా నేటివ్స్‌లాగా మాట్లాడగలడు.

మనుషులతో కలిసి వుండి పనిచేస్తూ వారి కష్టసుఖాలు అర్థం చేసుకోగలవాడు. మానవత్వపు విలువల మీద నమ్మకం వున్న మనిషి అతడు.

మరి ఇతర ఆంగ్లేయుల మాట ఏమిటి? బహుశా వారిలో కొందరు ఇండియన్స్ అసహాయతని ఆసరాగా తీసుకుని వారిని నిర్లక్ష్యం చేసి తమ సబ్బం గడుపుకుని సుఖ పడ్డారా? నిరంతరం దాస్యంలో వుండేలా ప్రయత్నాలు చేశారా? ప్రస్తుత పరిణామాలకి అలాంటి ఆంగ్లేయుల ప్రవర్తనా! ఏమో! ఎవరికి తెలుసు...

సుష్టుగా భోజనం చేశాడు. కూర నాకేశాడు. కడుపు నిండా నీళ్ళు తాగాడు. పొట్ట నిండుగా అని పించింది.

బ్రతికి వున్న ఫీలింగ్ ఎన్నో రోజుల తర్వాత కలిగింది.

"నీవు మంచి వాడివి" అన్నాడు కుర్రాడి వంకకు చూసి.

కుర్రవాడు సామానులు తీసుకుని వూరి దిశగా వెళ్ళిపోయాడు.

బాగా చీకటి పడింది.

ఊరిలో మంటలు కనబడుతున్నాయి.

ఎన్నో కంఠాలు మాట్లాడుకుంటున్నాయి. పిల్లల అరుపులు...

పచ్చిక మీద వెనకకి వాలి ఆంగ్లేయుడు నిద్రపోయాడు.

ప్రశాంతత ... నిద్రలో ఇంగ్లండ్ గురించి కలలు కన్నాడు. అలలు అలలుగా పచ్చటి మైదానాలతో నిండిన ఇంగ్లండ్ దర్శనమిచ్చింది. బ్యూటిఫుల్ మెడోస్... ఇంగ్లీష్ గ్రామీణ ప్రాంతాలు ... గార్డెన్స్ ... లండన్ పుర వీథులు... బ్రైటన్ బీచ్... లివర్‌పూల్ .. బ్రిస్టల్ ఎన్నో ఎన్నో ఇమేజస్ అతడి సబ్ కాన్షస్ నుండి బయటకు వచ్చి గుండెలు బరువెక్కించే బ్యూటీని సంతరించుకుని అతడిలో అవ్యాజమైన రాగ భావాలను కలిగిస్తూ జ్ఞాన చక్షువుల ముందు కదలాడాయి... మధుర స్వప్నాల్లా తీయని స్మృతుల్లా మరపురాని భావాలుగా రాగ రంజితమైన ఆ సమయంలో భరించ రాని ఉద్వేగం. అతడి గుండెల్ని నిండి పోయింది. ఉక్కిరి బిక్కిరి అయ్యాడతడు.

క్షణంలో కల చెదిరింది.

దుస్స్వప్నం ప్రారంభమైంది.

ఎర్రబడ్డ ఆకాశం క్రింద కాలుతున్న వూళ్ళు... శరీరాలు ... ఆక్రోశాలు ... పేలుతున్న తుపాకీ శబ్దాలు ... అది హెల్... హేడ్స్ ... నరకం ... నిద్రలో అతడు కన్నీరు కార్చాడు. భగవంతుణ్ణి ప్రార్థించాడు ఈ వినాశం ఆపమని.

"అరే! లే!"

బండ బారిన మొగ గొంతు ఉర్దూలో అంది. ఇదీ పీడకలలో భాగమేననిపించింది ఓ క్షణం పాటు.

ప్రక్క టెముకల మీద ఎవడో తన్నాడు. ఎముకలు విరిగాయా? భరించరాని నొప్పి...

కళ్ళు తెరిచాడు. చీకటిలో ఏవో ఆకారాలు అతడి చుట్టూ మూగి వున్నాయి. ఎవరెవరో కాగడాల వెలుతురులో తనని పరిశీలిస్తున్నారు. మొత్తం గ్రామ ప్రజలు అక్కడే వున్నట్టుగా కలకలంగా వుంది.

తన్ని లేపిన మనిషి కటువుగా అన్నాడు.

"అరేయ్ ఇంగ్లీష్ కుక్కా! లేవరా" అని ఉర్దూలో బూతులు తిట్టాడు.

ఆంగ్లేయుడు మెల్లగా లేచి కూచున్నాడు. ప్రక్క టెముకలలో భరించరాని నొప్పి.

"ఎవరు మీరు? ఎందుకు నన్నిలా హింసిస్తున్నారు!" పక్క టెముకలు రుద్దుకుంటూ అన్నాడు.

కొందరు నవ్వారు. మిగిలిన వాళ్ళు కూడా గొంతులు కలిపారు.

"దీనికి సమాధానం ఎవరు చెబుతారు?" వాళ్ళలో ఎవడో ఐవాంతికంగా ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకి సమాధానం వెంటనే ఎవరూ ఇవ్వలేదు.

"ఇంగ్లీష్ కుక్కలకి సంజాయిషీలూ...సమాధానాలూ ఇవ్వవలసిన గతి ఎవరికీ వుండని సమయం వచ్చింది" ఎవరో అన్నారు.

"మంగళ్ సింగ్!"

ఆ కంఠం వచ్చిన దిశగా కాగడాలు తిరిగాయి.

ఆరడుగుల పైనున్న ఎత్తు, ఎర్రటి తలపాగా, పెద్ద మీసాలూ, గెడ్డం, సిపాయి మంగళ్ సింగ్‌కి దారి ఇచ్చారు. అతడు వారికి నాయకుడని తెలుస్తోంది.

దట్టమైన కనుబొమల క్రింద అతడి కళ్ళు నల్లగా విచిత్రంగా మెరుస్తున్నాయి. విధేయత నాణాపు వెలియలి కట్టను దాటిన తరువాత కలిగే విచ్ఛిన్నత అందులో ప్రతిఫలిస్తోంది. విషాద పర్వంలో తనొక పాత్ర ధారుడని తెలిసిన వాడిలా వున్నాడతడు. ప్రతీకారానికి, పశ్చాత్తాపానికి మధ్య వుండే సన్నని తెర అతడిని ఇంకా స్వల్పంగా కంపరపెడుతున్నట్టుగా వుంది. తనకి కావలసిన పనేదో ధర్మమో, అధర్మమో పూర్తిగా అవగాహన కాకపోయినా విధి నిర్ణయపు పరాకాష్ఠకి అతడు బద్ధుడు. [illegible] ఆ కళ్ళు చూశాయి. అతడి చేతిలోని తుపాకీ నుంచి వెలువడిన బుల్లెట్లు అతడి నిర్దేశం ప్రకారం తమ ధర్మాన్ని నిర్వర్తించాయి. పవిత్ర శస్త్రం చేతిలో అతడు ఒక పావు అన్న సంగతి అతడికి నిజంగా తెలియదు.

"ఏమిటీ అన్యాయం? అర్ధరాత్రి మద్దెల దరువు అని" కటువుగా అన్నాడు.

"ఈ ఇంగ్లీష్‌వాడు ఇక్కడ దాగివున్నాడు"

"నిర్ణయం చేద్దాం మంగళ్ సింగ్?"

"ఆ సందేహం నీకు ఎందుకు వచ్చింది గురుచరణ్? ఇన్ని రోజుల తర్వాత నీకు మీమాంస రావడం తమాషాగా వుంది!"

"అది కాదు మంగళ్. ఈ వ్యక్తి ఎవరో తెలుసుకుని తర్వాత మన ధర్మాన్ని నిర్వర్తించాలని అనుకున్నాను."

"ఈ సమయంలో వ్యక్తులు ఎవరో ... ఎందుకో తెలుసుకోవలసిన అగత్యం మనకు లేదు గురుచరణ్. నీ ధర్మాన్ని నువ్వు చెయ్" ఆజ్ఞాపించి మరోసారి ఆంగ్లేయుడి వంకకు చూశాడు. ఆ కళ్ళలో శిలా కాఠిన్యం పూర్తిగా ఆక్రమించుకుని వుంది. ఆంగ్లేయుడి దీనావస్థకి ఎక్కడో అతడి అస్తిత్వపు లోతుల్లో పాతివేయబడ్డ ఆర్ద్రత బహు స్వల్పంగా పైకి వచ్చి లీలా మాత్రంగా క్షణం పాటు కనిపించి దూరమై పోయింది. కాఠిన్యపు ఇనుప తెరలు మూసుకున్నాయి.

ఆంగ్లేయుడు పానిక్ ... కలవరపాటుతో గబగబా అన్నాడు.

"నన్నేమీ చేయకండి. ప్లీజ్. దయ వుంచి నన్ను వదిలి వేయండి. నేను ఈ దేశానికి సేవ చేయడానికి వచ్చాను. శాయశక్తులా కష్టపడి నాకు చేతనైన విధంగా అభివృద్ధికి ప్రయత్నం చేశాను నేను"— అతడి మాటలు పూర్తి కాలేదు.

మంగళ్ సింగ్ తుపాకి ఎత్తి గుండె మీదికి గురి చూసి పేల్చాడు.

గుండు శరీరాన్ని చీల్చుకుంటూ ... మాటని మధ్యలో తుంచేస్తూ ... ప్రాణాల్ని తీసింది. అచేతనంగా ఆంగ్లేయుడి శరీరం వెనక్కి మెల్లగా వాలింది. అతడి కళ్ళు నిర్జీవంగా ఆకాశంవైపుకి చూస్తున్నాయి. పైన మబ్బులు దట్టంగా పరుచుకున్న ఆకాశం ... పిల్లగాలి వీస్తోంది.

ఆ జీవికి ఆ క్షణాన భౌతిక బాధల నుండి శాశ్వత విముక్తి లభించింది.

మంగళ్ సింగ్ నడిచి వెళ్ళిపోయాడు.

లాంతరు దగ్గరకు తెచ్చి ముఖాన్ని తేరిపార చూశాడు గురుచరణ్. మిగిలిన వ్యక్తులు కాగడాలతో తిరుగుదారి పట్టారు గ్రామం దిశగా. వాళ్ళలో వాళ్ళు మెల్లగా మాట్లాడుకుంటున్నారు.

పెరిగిన గడ్డం క్రింద నుండి ... మురికి తెరల క్రింద నుండి శరీరం ... నిండా వున్న గాయాలు, పుండ్ల వెనక నుండి ... ఓ మనిషి కనిపించాడు గురుచరణ్‌కి. వళ్ళు గగుర్పాటు చెందింది ఓ క్షణం పాటు. ఎంత పని జరిగింది? భగవంతుడా మేము చేసినది క్షమించరాని నేరం! తనలో తాను గొణుక్కున్నాడు గురుచరణ్.

మళ్ళీ మళ్ళీ తేరిపార చూశాడు.

అవును. తను గుర్తించిన వ్యక్తి అతడే!

ఘోరమైన తప్పు జరిగి పోయింది!

నిష్కృతి లేని నేరం చేశాము తాము!

బలంగా అరచేతులతో కణతలు రుద్దుకున్నాడు గురుచరణ్. కళ్ళు నులుపుకుని మళ్ళీ అచేతనంగా పడివున్న ఆంగ్లేయుడి శరీరం వంక చూశాడు.

జీవంలేని కళ్ళు ఆకాశం కేసి చూస్తున్నాయి.

లాంతర్ క్రింద పడేసి గురుచరణ్ గ్రామం దిశగా పరుగెత్తాడు.

ఆరుబయట మంక మంచాల మీద సిపాయిలు భోజనాలకి కూర్చున్నారు. నెగళ్ళు మండుతున్నాయి. స్త్రీలు వేడివేడిగా రొట్టెలు కాలుస్తున్నారు.

ఓ మంచం మీద మంగళ్‌సింగ్ కూర్చుని వున్నాడు. అతడి ప్రక్కనే చిన్న బల్ల మీద హుక్కా సరంజామా సిద్ధం చేయబడుతోంది.

చెమటలు కారుతుండగా, రొప్పుకుంటూ పరుగెత్తుకు వచ్చాడు గురుచరణ్. అతడి కళ్ళలో ఆవేదన.

మంగళ్‌సింగ్‌కి ఇతడి వాలకం అర్థం కాలేదు.

"ఏమైంది గురుచరణ్? ఎందుకలా వున్నావ్?"

"మంగళ్! మంగళ్!" చెప్పలేక ఆగిపోయాడు గురు

## గుడిసెల్లో...

*గుడిసెల్లో ఏముంటాయి?*
*తెలీకపోతే తెలుసుకో*
*ఖాళీ సత్తు గిన్నెలు, ఆ గిన్నెల*
*అంచుల్లో ఎండిన మెతుకులు,*
*నీటి చుక్కలు అందక ఆరిన పెదాలు*
*బొడ్డు కోసుకు పుట్టిన బిడ్డకు*
*పాలివ్వలేని పాలిన రొమ్ములు*
*నడాలకు పట్టని చావెదు గుడ్డలు*
*తడిసి ముద్దయిన గోడలు*
*క్రుంగిపోతున్న చూరులు*
*ఆ చూరుల క్రిందనున్న జీవమున్న శవాలు*
*ఇంతకంటే ఏముంటాయి గుడిసెల్లో?*

*ఈ గుడిసెల్లో మనసులుండవు*
*శరీరాలుంటాయి*
*ఆ శరీరాలకు కళ్ళుంటాయ్, ఆకళ్ళుంటాయ్*
*ఈ గుడిసెల్లో ఆడాళ్ళుంటారు*
*వీళ్ళకు అన్నలుంటారు, అన్నాలుండవు*
*వీళ్ళకి జెండాలు తెలీవు, ఎజెండాలు అర్థం కావు*
*జాతీయ గీతాలు రావు, నోటంట బూతులు పోవు*
*వీళ్ళకి టెక్స్టు బుక్కులు తెలీవు*
*సెక్సు బుక్కులూ తెలీవు*
*అందులో రాతలు చదవరు, కూతలు వినరు*
*కొందరు అడుక్కు తింటారు*
*కొందరు తమను అమ్ముకుతింటారు*
*కొందరు దోచుకు తింటారు.*
*మరి కొందరు ముడుచుక్కూచుంటారు*
*వీళ్ళు నాయకులు కాదు, తెల్ల గుడ్డలు కట్టడానికి*
*భాగ్యవంతులు అంతకంటే కాదు*
*కంబ్ గుడ్డలు చుట్టడానికి*
*గుడిసెల్లో వాళ్ళు చిరిగిన బట్టలు చుడతారు*
*వీళ్ళకి రక్తమాంసాలుండవు ఎముకలుంటాయ్*
*ఆ ఎముకలు ఓట్లేయడానికి పనికొస్తాయ్*

*మూడు కాలాలకి ప్రతినిధులు వీరు*
*శతాబ్దానికి శతాబ్దానికి వారధులు వీరు*
*చరిత్రకారుల పుస్తకాల్లో నిరక్షరాలు వీళ్ళు*
*కవులు రాసే పదాలలో ప్రథములు వీళ్ళు*

—యాంత్రడపు రాజశేఖర్

చరణ్.

"బేవకూఫ్‌లా ప్రవర్తించకు గురుచరణ్. ఏమిటి సంగతి?" కటువుగా అన్నాడు.

"భగవంతుడా!" కళ్ళు చేతులతో గట్టిగా మూసుకుని ఆకాశం వైపుకి తలెత్తాడు. అతడి కంఠం నుండి వర్ణనాతీతమైన శబ్దాలు వచ్చాయి.

"నీవెందుకలా మాట్లాడుతున్నావ్ గురుచరణ్?"

"దానికి ఓ కారణముంది"

"ఆ కారణం ఏదో సవ్యమైందిఅయితే బావుంటుంది!"

"అవును సవ్యమైనదనే అనుకుంటున్నాను."

"ఏమిటది?'

"ఆ మనిషి ఈ ప్రాంతాల్లో పనిచేసిన వారిలోకి అత్యుత్తముల్లో ఒకడు. దీక్షతో పనిచేసినవాడు ... తన సుఖాల్ని ... భోగభాగ్యాల్ని ఖాతరు చేయకుండా ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం పనిచేసిన వాడు. ప్రజల సమస్యల్ని అర్థం చేసుకుని వారి యోగక్షేమాల కోసం తన కాలాన్ని వెచ్చించినవాడు. అతడేమి చేసినా ప్రజా క్షేమం, అభివృద్ధి- ఇవే ముఖ్యమైన ఉద్దేశాలు. నీకింకా కనబడలేదా? ఈ గ్రామాల్లోని నూతులు ... రోడ్లు ... చెరువులు ... కరువు ప్రాంతాల్లో కరువు పనులు ... ఇవన్నీ ఈ వ్యక్తి వూహించి, ఆలోచించి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలే. ఈ ప్రాంతాల్ని పాలించిన వారిలో ఇలాంటి మనిషి ఎన్నడూ లేడు.

అతడిని చంపడం తప్పేనని ఇప్పటికైనా ఒప్పుకుంటావా మంగళ్ సింగ్?"

నెగళ్ళు మండుతున్నాయి. అగ్నికీలలు నీకల్లను నీల్చుకుంటూ ఎగుస్తున్నాయి. వంట కార్యక్రమం పూర్తి కావస్తోంది ... వడ్డించడానికి మహిళలు సిద్ధమౌతున్నారు. కంచాలు కడిగి సత్తు గ్లాసుల్లో నీళ్ళు పెట్టే సన్నాహాలు చేస్తున్నారు.

మంగళ్‌సింగ్ భృకుటి ముడిపడింది. దీర్ఘమైన ఆలోచన అతడిని ఆవరించింది.

చివరికి అన్నాడు.

"నీకు ప్రపంచ వ్యవహారాల్లో నాఅంత అనుభవం లేదు గురుచరణ్. అని నన్ను మించినవి. నాకు తెలిసిన విషయం ఒక్కటే! విదేశీయులు మనల్ని బలవంతంగా అణచి వారి అదుపులో వుంచుకున్నారన్నది నిర్వివాదాంశం. వాళ్ళ బాయ్‌నెట్లతో ... బైబిళ్ళతో ... ఫిరంగులతో ... క్షణక్షణం వాళ్ళకి అనుకూలంగా మారే న్యాయవ్యవస్థతో మనల్ని, మన సంస్కృతిని వారు మార్చేస్తున్నారు. వారి అవసరం మనకి వుందని నేననుకోను. వాళ్ళెందుకు ఇక్కడ వుండాలి గురుచరణ్? నా ప్రశ్నకి సమాధానం చెప్పు. ప్రజలు ఎవరి దేశంలో వారు వున్న తమ తమ దేశస్థుల యోగక్షేమాల్ని చూసుకుంటే ఈ ప్రపంచంలో శాంతి వుంటుంది. వాళ్ళ దేశానికి వాళ్ళు పోతే అందరికీ క్షేమకరం కాదా! మనల్ని పరిపాలించుకోగల సామర్థ్యం మనకి వుందని నా నమ్మకం. నీవేమంటావు?"

"మనం అంటే ఎవరం మంగళ్? గ్రీకులు రాక ముందు మనం ఎవరం? యవనులు ... పార్థియన్స్, కుషానులు, హూణులు వీరందరు రాకముందు మనం ఎవరం ... ఆ తర్వాత మనం ఎవరం? మొగల్ సామ్రాజ్యానికి ముందు మనం ఎవరం మంగళ్ సింగ్? ఇవి మారిన చారిత్రక సమయాలు ... అవి మనుషుల్ని మార్చేశాయి. మనం మనం కానే కాదు. మారుతున్న చరిత్రాత్మకశక్తులనిర్ణయం ప్రకారంమనం కూడా మారిపోతున్నాం. ఆంగ్లేయులు వెళ్ళేనాటికి మనలో అన్ని రకాల మార్పులు రాక తప్పదు. సంస్కృతీ పరంగా ... రాజకీయంగా ... ఆలోచనాపరంగా ... అన్ని విధాలుగా ... వాళ్ళు మనల్ని వదిలితే....

"వాళ్ళు వెళ్ళక తప్పదు. వెళ్ళి తీరుతారు" అన్నాడు మంగళ్‌సింగ్. కఠినంగా. నిట్టూర్చి అన్నాడు గురుచరణ్.

"ఒక విషయం నీవు గుర్తుంచుకోవడం లేదు మంగళ్, ఈ దేశం మారే అదృష్టాలకి ఆట స్థలం ... దండయాత్రలకి ప్రథమ స్థానం ... ముక్కలు చెక్కలైన సమాజ శకలాలతో నిండిన ప్రదేశం ... ఆత్మవిశ్వాసం, తట్టుకోగల ధైర్యం వున్న ఏ విదేశీయుడికైనా ఆటస్థలం ... బహుశా మనలోని వైవిధ్యం వల్ల అలా జరుగుతుందనుకుంటాను ... మనలో ఐక్యత శూన్యం ... ఈ ప్రపంచంలో మనలాంటి అనైక్యతలో వుండే ప్రజలు ఎక్కడా వుండరని నా నమ్మకం ... ఈ దేశం ఏదో రూపంలో వుంటుంది. కాని ఐక్య భారత దేశం అనేది వుండటం చాలా కష్టసాధ్యం ... అన్ని విధాలా ఐక్యత సాధ్యం కాదనుకుంటాను. ఒప్పుకుంటావా మంగళ్‌సింగ్?"

"తప్పకుండా గురుచరణ్! నిజ స్థితి అలా వుంటే మార్చడానికి మనం ఎవరం? ప్రశ్నించడానికి కూడా మనకి స్తోమత లేదు. మామూలు సిపాయిలం మనం. మనం మార్చగలిగేవి చిన్న విషయాలు ... అత్యవసరమైన అల్ప విషయాలు మనం మార్చగలం. మనం సామాన్యులం. ఆ సంగతి నాకు బాగా తెలుసు."

కాలుతున్న నెగళ్ళ వంక ఎర్రటి కళ్ళతో చూశాడు మంగళ్ సింగ్. అతడి కళ్ళలో నెత్తుటి జీర ... వేదనతో కూడిన అసందర్భపు మనోస్థితి. రవ్వలు రేగుతున్నాయి నెగళ్ళ మీద. వంటలు,వడ్డన పూర్తయ్యాయి. సిపాయిలు చేతులూ, కాళ్ళూ కడుక్కుంటున్నారు. భోజనం తినడానికి సిద్ధమౌతున్నారు. అర్ధరాత్రి దాటుతోంది. అంతటా ప్రశాంతం.

అది చల్లని రాత్రి. పిల్లగాలి వీస్తోంది ఆహ్లాదకరంగా. ఆకాశం నక్షత్ర ధూళితో నిండిపోయి వుంది. వజ్రాలు పొదిగిన ముఖమల్ దుప్పటిలా ఆకాశం మెరుస్తోంది. ఆ పందిరి కింద సిపాయిలు భోజనం చేయడం మొదలు పెట్టారు. అలసిపోయిన మనుషులు వాళ్ళు. గత కొద్ది రోజులుగా వారు వేళకి తిని, నిద్రించిన సమయాలు తక్కువ. వారు గ్రామాల్లో పర్యటిస్తూ విదేశీయుల దురంతాలను గురించి వారికి బోధపరుస్తూ తిరుగుతున్నారు. ఫిరంగీలను ఈ దేశపు నేల నుండి వెళ్ళగొట్టాలి. నిర్దాక్షిణ్యంగా ఆ శృంఖలాలను త్రెంచుకోవాలి.

ఆంగ్లేయులు వారికి దయాభిక్ష పెట్టరని వారికి తెలుసు. ఈ పోరాటంలో గెలుపు, ఓటములు వారి జీవన మరణాలకి ఎంతో ముఖ్యమైన విషయాలు. తిరిగి ఎటూ పోలేని పరిస్థితి వారిది. చావో బ్రతుకో తేలే వరకూ ఈ ప్రమాదకరమైన పరిస్థితి కొనసాగాల్సిందే. ఈ భయంకర సత్యం వారికి తెలుసు. అందువల్ల ప్రస్తుతం లభించిన అవకాశాన్ని తమకి అనుకూలంగా మలుచుకుని వాడుకోవాలి. ఈ అవకాశం చేజారితే మళ్ళీ రాకపోవచ్చు. ఎప్పుడో ఓసారి వచ్చే మహత్తర అవకాశం ఇది. తప్పులు చేసే ప్రశ్నే లేదు. నిద్రాహారాలు లేకుండా తాము నమ్మిన ఈ పథకం విజయవంతం అయేవరకూ ఆ దీక్ష కొనసాగవలసిందే. వారి ధ్యేయం మొగల్ చక్రవర్తి బహదుర్ షా జఫర్‌ని ఢిల్లీ చక్రవర్తిగా సింహాసనం ఎక్కించడం. ఆ పైన బ్రిటిష్ వారిని తరమడం ... చరిత్ర అదే చదుస్తుంది.

మొగల్ సామ్రాజ్యానికి మళ్ళీ ప్రాణం పొయ్యాలి. అది వారి స్వప్నం. అది వారి ధ్యేయం. అందువల్లనే ఈ మారణహోమం.

అందరూ నిశ్శబ్దంగా ఆలోచనలో మునిగిపోయి భోజనాలు చేస్తున్నారు. నిద్రముంచుకు వస్తోంది.

భోజనం పూర్తిచేశాక హుక్కా పీలుస్తూ మంచం మీద వాలి అన్నాడు మంగళ్‌సింగ్.

"ఇంతకీ ఆ ఆంగ్లేయుడు ఎవరు గురుచరణ్?"

"అతడా? అతడు జేమ్స్ లాయిడ్ సాహెబ్. హామీర్‌పూర్ మేజిస్ట్రేటు. మంచి ఆఫీసర్. ప్రజల మన్నన పొందినవాడు".

"ఓహో! అలాగా!" అంటూ పొగ వదులుతూ చుక్కల వంకకి చూశాడు మంగళ్‌సింగ్. తారాపథమంతా నిర్లక్ష్యంగా మానవ ప్రపంచాన్ని చూస్తున్నది.

నిట్టూర్చాడు. హుక్కా ప్రక్కన పెట్టి కళ్ళు మూసుకున్నాడు.

మరణించిన ఆంగ్లేయుడు నిర్జీవపు కళ్ళతో ఆకాశం వంకే చూస్తున్నాడు విషాద నాటకం చూస్తున్న వాడిలా ... సగం చరిత్ర ... సగం పీడకల ... చల్లగాలి వీస్తోంది. రాత్రి కరుగుతోంది.

◆

